సాక్షి చిత్తూరు

ఆదివారం । 21 । జనవరి । 2024



ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు
జిల్లాలోని నవోదయ స్కూళ్లలో 6వ తరగతి ప్రవేశాలకు పరీక్షలు శనివారం సజావుగా జరిగినట్లు అబ్జర్వర్, డీఈఓ తెలిపారు. - 8లో



నిత్యాన్నదానానికి రూ.3 లక్షల విరాళం
కాణిపాకం వినాయకుడి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి దాతలు రూ.3 లక్షలు వేర్వేరుగా విరాళం అందించారు. - 8లో



విషపురాతలను సహించం
పచ్చపత్రికల విషపు రాతలను సహించమని ఎస్వీ యూనివర్సిటీ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. - 8లో

న్యూస్‌రీల్

పోలీస్ ట్రైనింగ్ గ్రౌండ్ ప్రారంభం



గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: తక్కువ సమయంలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, త్వరలో ఈ మైదానాన్ని మరింత అందంగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా పోలీస్ ట్రైనింగ్ గ్రౌండ్స్ శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేసి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నగరంలో విశాలమైన మైదానాన్ని ఏర్పాటు చేసి అందుబాటులోకి తేవడం సంతోషకరమన్నారు. క్రికెట్‌తో పాటు ఇతర క్రీడల నిర్వహణకు కూడా ఈ మైదానంలో ఏర్పాట్లు చేస్తామన్నారు. త్వరలో రన్నింగ్ ట్రాక్‌లను నిర్మిస్తామని, సామాన్య ప్రజలు కూడా వీటిని వినియోగించుకునేలా చూస్తున్నామని తెలిపారు. ఇందుకు కృషి చేసిన పోలీసు అధికారులను వారు ప్రశంసా పత్రాలతో అభినందించారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

కుప్పం: పట్టణంలోని గుడుపల్లె రోడ్డులో ఉన్న ఐఆర్ఎం విద్యాసంస్థలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చినట్లు కళాశాల చైర్మన్ దయానిధి తెలిపారు. కళాశాల విద్యార్థులే కాకుండా కుప్పం పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులు 140 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో 116 మంది విద్యార్థులను పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు చెప్పారు.

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్



విజేతగా నిలిచిన పోలీసు జట్టుకు బహుమతి అందిస్తున్న కలెక్టర్, ఎస్పీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని పోలీసు క్రీడా మైదానంలో శనివారం క్రికెట్‌మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఈ పోటీన్ని జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి ప్రారంభించారు. వారు కాసేపు బ్యాట్ పట్టి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ప్రారంభమైన మ్యాచ్‌లో పోలీసు, రెవెన్యూ జట్లు నువ్వా..నేనా అన్నట్లు పోటీ పడ్డాయి. చివరకు పోలీసు జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టుకు బహుమతితో పాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు సుధాకర్ బాబు, శ్రీలక్ష్మి, నాగేశ్వర రావు, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

చిత్తూరు అర్బన్: రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రహదారి భద్రత మాసోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ గ్రౌండ్‌లో కలెక్టర్, జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డితో కలసి భద్రత మాసోత్సవాలకు సంబంధించిన బ్యానర్లు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 19 వరకు రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. యువతకు రహదారి భద్రతపై సాంకేతికంగా అవగాహన కల్పించడమే ఈ మాసోత్సవ ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో డీటీసీ నిరంజన్ రెడ్డి, ఎంవీఐలు తదితరులు పాల్గొన్నారు.



అతివకు చేయూత



చేయూత మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఆర్‌కే రోజా (ఫైల్)

నియోజకవర్గంలోని మండలాలు	5
మున్సిపాలిటీలు	2
పంచాయతీలు	77
మున్సిపల్ వార్డులు	56
సచివాలయాలు	90

చేయూత లబ్ధిదారులు **15645 మంది**

ఖతాలకు జమ అయిన నిధులు **రూ.87.97 కోట్లు**

కుటుంబ నిర్వహణలో మహిళలే కీలకం. సామాన్య, మధ్య తరగతి వర్గాల వారికి కుటుంబ పోషణ, పిల్లల చదువులు పెనుభారంగా ఉండేవి. అయితే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక మహిళల స్థితిగతులే మారిపోయాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అతివలకు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక చేయూత అందించి, ప్రతి సంక్షేమ పథకాన్ని కూడా మహిళల పేరిట అమలు చేస్తూ వారిని అందలం ఎక్కిస్తున్నారు. ప్రతి రూపాయి వారి ఖాతాల్లోకే జమ అవుతోంది. దీంతో కుటుంబాల నిర్వహణ సులభతరమైంది. అక్కచెల్లెమ్మలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చూపుతున్న ప్రేమాభిమానాలకు ఇది అద్దం పడుతోంది.

- ప్రతి సంక్షేమ పథకం మహిళల పేరిట అమలు చేస్తున్న సీఎం జగన్
- ఆడపడుచులకు వైఎస్సార్ చేయూత ద్వారా రూ.87.97 కోట్లు సాయం అందించిన ప్రభుత్వం
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలకు ఆర్థిక ప్రయోజనం
- నగరి నియోజకవర్గంలో 15,645 మందికి సాయం
- కుటుంబ నిర్వహణకు మరింత చేయూత

నియోజకవర్గ వ్యాప్తంగా లబ్ధిదారుల వివరాలు

మండలం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి కోట్లలో
నగరి మండలం	2191	12.32
నగరి మున్సిపాలిటీ	3299	18.55
పుత్తూరు మండలం	1380	7.76
పుత్తూరు మున్సిపాలిటీ	2344	13.18
విజయపురం	2928	16.47
వడమాలపేట	1866	10.49
నింద్ర	1637	9.20
మొత్తం	15645	87.97



ఇంటి వద్దకే వచ్చి తనిఖీ చేస్తున్న వలంటీర్

నగరి : మహిళా సాధికారతే లక్ష్యంగా పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ చేయూత పథకంలో భాగంగా 45 ఏళ్ల వయసు నుంచి 60 ఏళ్ల లోపు వయసు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ప్రభుత్వం నాలుగేళ్లలో రూ.75 వేలు ఆర్థిక సాయం అందించేందు తలపెట్టిన మహాయజ్ఞమే 'వైఎస్సార్ చేయూత' కార్యక్రమం. మహిళల ఆర్థిక స్వావలంబనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ గతంలో ఎన్నడూ లేనివిధంగా పేద, మధ్య తరగతి వర్గాల మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే పరమావధిగా ముందుకు సాగుతోంది. ఏటా రూ.18,750 మహిళల ఖాతాల్లోకి చేరుతోంది. ఇలా నాలుగు విడతల్లో వారికి రూ.75 వేలు చొప్పున నగరి నియోజకవర్గవ్యాప్తంగా 15,645 మంది మహిళలు లబ్ధిపొందారు. వీరి ఆర్థికాభివృద్ధికి ఇప్పటికే రూ.87.97 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. లబ్ధిదారుల్లో 4,878 మంది ఎస్సీ మహిళలు, 955 మంది ఎస్టీ మహిళలు, 9306 మంది బీసీ మహిళలు, 499 మంది మైనారిటీ మహిళలు, 7 గురు క్రిస్టియన్ మహిళలు ఉన్నారు. గత ప్రభుత్వాలు ఏవీ కూడా తమకు ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు అందించి ఆదుకోలేదని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బుగ్గఅగ్రహారంలో దుకాణం నిర్వహిస్తున్న మహిళను అభినందిస్తున్న మంత్రి రోజా (ఫైల్)

ఇలాంటి సీఎంను చూడలేదు



ప్రతి పథకం మహిళల పేరిట అమలు చేస్తూ మాకు ఇంతటి గౌరవం తెచ్చిన ముఖ్యమంత్రిని ఇప్పటివరకు చూడలేదు. నాకు చేయూత ద్వారా మూడు విడతల్లో రూ.56,250 వచ్చింది. ఇదిగాక పెన్షన్, రైతు భరోసా, ఆసరా, సున్నావడ్డీ, అమ్మఒడి, వాహన మిత్ర అంటూ సుమారు రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూరింది.

– నాగరాజులమ్మ, నంబాకం, నగరి మండలం

కిరాణాకొట్టు నడుపుతున్నా..



ప్రభుత్వం అందించిన చేయూతతో కిరాణాకొట్టు నడుపుతున్నా. మూడేళ్లపాటు వైఎస్సార్ చేయూత అందడంతో పాటు మా ఎస్‌హెచ్‌జీ గ్రూపునకు ఆసరా, సున్నావడ్డీ రుణాల కింద నా వాటాకు వచ్చిన సొమ్ముతో పెట్టుకున్న ఈ దుకాణమే నాకు నేడు అండగా నిలుస్తోంది. ఇంతటి సాయం గతంలో ఏ ప్రభుత్వం అందించలేదు.

– శంకరమ్మ, చిన్నలూరు, నగరి మండలం

ఎంతో ఉపయోగం..



వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.18750 చొప్పున మూడు సార్లు అందింది. నాల్గవ సారి అందనుంది. ఈ నగదు మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఎంతో ఉపయోగపడింది. నాలాంటి మహిళలకు అండగా ఉన్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– తులశమ్మ, టీసీ అగ్రహారం, వడమాలపేట మండలం

అల్లా దయతో జగనన్నే మళ్లీ సీఎం..



నాకు మూడు విడతల్లో చేయూత పథకం ద్వారా రూ.56250 సాయం అందింది. ఆసరా ద్వారా కూడా లబ్ధి పొందాను. చేయూత తొలి విడత డబ్బుతో చిన్నపాటి షాప్ పెట్టుకున్నా. అందులో వచ్చే చిన్నపాటి ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. జగనన్న లాంటి సీఎంను మాకు ఇచ్చిన అల్లాకు ధన్యవాదాలు. మళ్లీ జగనన్నే సీఎం అవుతారు.

– జకీరాబేగం, షాపు వీధి, పుత్తూరు మున్సిపాలిటీ

మహిళలకు వరం



వైఎస్సార్ చేయూత పథకం మహిళలందరికీ ఒక వరం. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి అండగా ఉంటోంది. ఈ పథకం ద్వారా ఇస్తున్న రూ.18,750తో కష్టాలను అధిగమిస్తూ మహిళలు ఆనందంగా జీవిస్తున్నారు. చేయూత ద్వారా వచ్చే సొమ్ముతో చేపల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాను. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి సదా రుణపడి ఉంటా.

– గాంధీ, నింద్ర, నింద్ర మండలం

పుంగనూరులో సౌర కాంతులు



సోలార్ ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న అలీమ్‌బాషా, నాగభూషణం



ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేయనున్న స్టోరేజ్ బ్యాటరీలు

రాష్ట్రంలోని ఏ మున్సిపాలిటీలో లేని విధంగా పుంగనూరులో సోలార్ విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేశారు. త్వరలో సోలార్ విద్యుత్‌వినియోగంలోకి రానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి కృషి ఫలించింది. రూ.6 కోట్లతో యుద్ధప్రాతిపదికన ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేశారు. ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

- రూ.6 కోట్లతో సోలార్ ప్లాంటు ఏర్పాటు
- ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి
- మున్సిపాలిటీకి నెలకు రూ.25 లక్షల ఆదా
- ఫలించిన మంత్రి పెద్దిరెడ్డి ప్రయోగం
- ఫిబ్రవరిలో ప్రారంభం

పుంగనూరు: త్వరలో పుంగనూరులో సోలార్ విద్యుత్ వినియోగంలోకి రానుంది. పట్టణంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుపై సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో ప్రతినెల రూ.35 లక్షలు విద్యుత్‌శాఖకు బిల్లుల రూపంలో చెల్లిస్తున్నారు. ఇది మున్సిపాలిటీకి భారం కావడంతో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి దీనిపై కసరత్తు చేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులు రూ.6 కోట్లు కావాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ప్లాంటు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. డిసెంబర్ 5న ఈ పనులకు మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, కమిషనర్ నరసింహప్రసాద్ ఈ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు.


విద్యుత్ ఆదా

సోలార్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా ఒక మెగా వాట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. ఇందుకు అనుగుణంగానే సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీధి దీపాలు, మున్సిపల్ కార్యాలయం, తాగునీటి పథకాలు, తదితర వాటికి రోజుకు 4వేల యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతోంది. సోలార్ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్‌ను మున్సిపాలిటీ అవసరాలకు పోను మిగులును విద్యుత్‌శాఖకు విక్రయించేలా చర్యలు చేపట్టారు.

రూ.5.25 కోట్ల ఆదా....

సోలార్‌ప్లాంట్ ఏర్పాటుతో మున్సిపాలిటికి ఏడాదికి రూ.5.25 కోట్లు ఆదా కానుంది. ప్రస్తుతం నెలకు రూ.35 లక్షల విద్యుత్ వినియోగం అవుతోంది. సోలార్ ప్లాంట్ వినియోగంతో ఖర్చు తగ్గుతుంది. తద్వారా మున్సిపాలిటీలో అదనంగా ప్రజలకు అవసరమైన వసతులు, అభివృద్ధి పనులు చేపట్టవచ్చు.

ప్రణాళికబద్ధంగా అమలు



మున్సిపాలిటీలో ఏటా సుమారు రూ.4 కోట్లు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నాం. తద్వారా మున్సిపాలిటికి అధిక భారం పడుతోంది. విద్యుత్ వినియోగాన్ని తగ్గించి, సహజసిద్ధమైన సూర్యరశ్మితో విద్యుత్‌ను ఉత్పత్తికి శ్రీకారం చుట్టాం. ప్రణాళికబద్ధంగా సోలార్ ప్రాజెక్టులను అమలు చేసేందుకు ముఖ్యమంత్రితో చర్చించి చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి

మోడల్ పుంగనూరుగా..



పుంగనూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ పుంగనూరుగా రూపుదిద్దుతున్నాం. పుంగనూరును పారిశ్రామిక కేంద్రంగా మార్చుతున్నాం. నిరుద్యోగులకు ఉపాధి కల్పించనున్నాం. ముఖ్యమంత్రి జగనన్న ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ఆహర్నిశలు పని చేస్తున్నాం. సోలార్ ప్లాంట్‌తో విద్యుత్‌ను ఆదా చేయనున్నాం.

– పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

వినాయకుడి సేవలో పలువురు ప్రముఖులు





కేంద్ర న్యాయశాఖ ట్రిబ్యునల్ మెంబర్ వెంకటరామకృష్ణకు స్వామివారి ప్రసాదాలు అందజేస్తున్న అధికారులు, దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్, ద్వారక తిరుమల దేవస్థాన ఈఓతో ఆలయ అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కేంద్ర న్యాయశాఖ లా ట్రిబ్యునల్ మెంబర్ వెంకటరామకృష్ణ, బద్రీనాథ్ కుటుంబ సభ్యులు, విజయవాడ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్ కర్ణాటి రాంబాబు, ద్వారకా తిరుమల దేవస్థానం ఈఓ త్రినాథ్ వేర్వేరుగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ హరిమాధవ రెడ్డి, ధనుంజయ, ఐరాల తహసీల్దార్ సుశీల, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'పశుబీమా'ను సద్వినియోగం చేసుకోండి



బహుమతులు అందజేస్తున్న జేడీ ప్రభాకర్



పేయదూడలను పరిశీలిస్తున్న వెటర్నరీ అధికారులు

తవణంపల్లె: రైతులు పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. శనివారం మండలంలోని వెంగంపల్లెలో ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పశుసంతతి పరిశీలనా పథకం కింద సంకరజాతి జెర్సీ పేయదూడల ప్రదర్శన నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు ఈ ప్రదర్శనను తిలకించి, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం జేడీ మాట్లాడుతూ పేయదూడలకు సరైన పోషణ ఇవ్వాలన్నారు. బ్రూసిల్లా వ్యాక్సిన్, గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్లు, నట్టల నివారణ మందుల ఆవశ్యకత, మొబైల్ వెటర్నరీ అంబులెన్స్ సేవల గురించి వివరించారు. అనంతరం పేయదూడలను ఆరోగ్యంగా పోషించిన పాడి రైతులకు ప్రోత్సాహకర బహుమతులు అందజేశారు. పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ హరీఫ్, పీటీపీ డీడీ వాసు, ఐరాల ఏడీ పద్మావతి, పశు వైద్యాధికారులు లావణ్య, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

పచ్చ పత్రికల విషపు రాతలు సహించం



ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను దహనం చేస్తున్న విద్యార్థి విభాగం నాయకులు

తిరుపతి సిటీ: 'పచ్చ' పత్రికల విషపు రాతను సహించబోమని ఎస్వీయూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. విజయవాడలో దళితుల ఆత్మగౌరవానికి ప్రతీకగా 206 అడుగుల అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పాన్ని ఆవిష్కరిస్తే టీడీపీ అనుకూల మీడియా ఈ కార్యక్రమంపై కూడా విషపు రాతలు రాయడంతో తిరుపతి ఎస్వీయూ ప్రధాన గేటు వద్దగల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం ఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షల మంది దళితులు అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు విచ్చేసి సంఘీభావం తెలియజేశారన్నారు. దళిత వ్యతిరేకి చంద్రబాబుకు అంబేడ్కర్ విగ్రహం నెలకొల్పడం ఇష్టం లేక అవమానించి మాట్లాడడం దారుణమని విమర్శించారు. జగనన్న ప్రజాదరణను చూసి ఓర్చుకోలేక చంద్రబాబు పిచ్చివాడిలా ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. పచ్చ పత్రికలకు బాబుకు వంతపాడుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు, 23వ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

కుప్పంరూరల్: అనుమానాస్పదస్థితిలో యువకుడు దుర్మరణం పాలైన సంఘటన కుప్పం మండలం పెద్దబంగారునత్తం చెరువు వద్ద శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలిలా.. సామగుట్టపల్లికి చెందిన సంజయ్ (27) పెద్దబంగారునత్తం గ్రామానికి చెందిన తన నలుగురు స్నేహితులతో కలిసి తెప్ప సహాయంతో చెరువులో విహారానికి వెళ్లినట్లు చెప్పారు. చెరువు మధ్యలోకి వెళ్లగానే సంజయ్ చెరువులో మునిగిపోయినట్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులకు తెలియడంతో చెరువులో వెతికినా ఫలితం లేకపోయింది. స్నేహితులను విచారించినా వారి నుంచి సరైన సమాధానం లేకపోవడంతో సంజయ్ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

- సీజ్ చేసిన మద్యం విలువ రూ.5 లక్షలు
- కీలక నిందితుడు గిరిపై పీడీ యాక్టుకు ఉన్నతాధికారులకు నివేదిక
- ఇద్దరు నిందితుల అరెస్ట్, మీడియాకు వివరాలు వెల్లడించిన డీఎస్పీ సుధాకర్‌రెడ్డి
- గత కొన్నేళ్లుగా నిందితులది ఇదే వ్యాపారం
- పరారీలో ఉన్న మరో ఏడుగురు నిందితుల కోసం గాలింపు



పట్టుబడిన మద్యం, నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ కృష్ణమోహన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

గంగవరం: కర్ణాటక నుంచి ఏపీలోని పలు ప్రాంతాలకు అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఓ ముఠాను అరెస్టు చేసి, వారి వద్ద ఉంచి సుమారు రూ.5 లక్షల విలువ చేసే మద్యం, రవాణాకు వినియోగించిన ఓమ్నీ వాహనాన్ని సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి శనివారం గంగవరం పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అరెస్ట్ చూపించారు. డీఎస్పీ మాట్లాడుతూ గంగవరం మండలం పసుపత్తూరు పంచాయతీ కురప్పల్లికి చెందిన గిరి కర్ణాటక మద్యం రవాణా, విక్రయాల కోసం కొందరిని కిరాయికి మాట్లాడుకుని వాళ్ల ద్వారా కర్ణాటక నుంచి మద్యం కొనుగోలు చేసి, దాన్ని పలమనేరు నియోజకవర్గం పరిధిలోని గ్రామాల్లో అధిక ధరలకు విక్రయిస్తుంటారు. అందులో భాగంగానే భారీ మొత్తంలో మద్యం సరఫరా చేస్తూ పోలీసులకు ఇద్దరు నిందితులు పట్టుబడగా, కీలక సూత్రధారి పరారీలో ఉన్నట్లు చెప్పారు.

ఎలా పట్టుబడ్డారంటే..!

గత శుక్రవారం రాత్రి బెంగళూరు జాతీయ రహదారిలోని పత్తికొండ గ్రామం బస్టాప్ వద్ద గంగవరం పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో నంగిలి వైపు నుంచి వస్తున్న ఓ మారుతీ ఓమ్నీ వాహనాన్ని అనుమానం వచ్చి తనిఖీ చేశారు. అందులో కర్ణాటక మద్యం (ఒరిజినల్ చాయిస్ టెట్రా ప్యాకెట్లు) దాదాపు 45 కేసులు ఉన్నాయి. పోలీసులు వెంటనే నిందితులు గంగవరం మండలం బెస్తగానపల్లికి చెందిన కేశవులు, కురప్పల్లికి చెందిన గంగాధర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మద్యంతో పాటు కారును సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. నిందితులను విచారించగా మద్యం అక్రమ సరఫరాలో కీలక సూత్రధారి గిరి ఆదేశాల మేరకు వీరు నంగిలిలోని దీపికా వైన్స్ దుకాణంలో పని చేస్తున్న క్యాషియర్ శేఖర్ ద్వారా పెద్దఎత్తున మద్యం తీసుకుని వచ్చి రాత్రి వేళ కురప్పల్లికి చెందిన బాబు, హరి, నాయనిచెరువుకు చెందిన మణి, పత్తికొండకు చెందిన వెంకట్రామయ్య, బైరెడ్డిపల్లి మండలం లక్కనపల్లికి చెందిన నందకుమార్‌కు మద్యం సరఫరా చేస్తారు. వీరు తమ గ్రామ పరిసరాల్లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటారు. ఈ క్రమంలో గత శుక్రవారం రాత్రి మద్యం రవాణా చేస్తూ పోలీసులకు దొరికారు. విచారణలో గత కొన్నేళ్లుగా వీరు అక్రమ మద్యం వ్యాపారం చేస్తున్నట్లు తేలింది. మొత్తం 9మందిపై కేసు నమోదు చేసి పట్టుబడిన కేశవులు, గంగాధర్ ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. ఇందులో ప్రధాన సూత్రధారి గిరిపై గతంలో అనేక కేసులు నమోదైన నేపథ్యంలో పీడీ యాక్ట్ తెరవడం కోసం జిల్లా కార్యాలయానికి నివేదిక పంపినట్టు చెప్పారు. పరారీలో ఉన్న మిగిలిన ఏడుగురు నిందితులను త్వరలోనే పట్టుకుని రిమాండ్‌కు పంపుతామన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు

- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన పరీక్షల అబ్జర్వర్, డీఈఓ



పుంగనూరు: పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా శనివారం నవోదయ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని వలసపల్లె నవోదయ పాఠశాలలో 6 వ తరగతిలో ప్రవేశానికి ప్రవేశ పరీక్షలను ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో జరిగిన ఈ పరీక్షలకు 4,789 మంది విద్యార్థులకు గానూ 3,919 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షల జిల్లా స్థాయి అబ్జర్వర్ గోవింద్‌రావ్ వెల్లడించారు. 870 మంది గైర్హాజరయ్యారని, మొత్తం 81.09 హాజరు శాతం నమోదైనట్లు తెలిపారు. అబ్జర్వర్ చిత్తూరు, బంగారుపాళ్యం పరీక్ష కేంద్రాలను, డీఈఓ విజయేంద్రరావు పుంగనూరు, కుప్పం పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండల కేంద్రంలోని బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నవోదయ ప్రవేశ పరీక్షలు సజావుగా జరిగినట్లు ఎంఈఓ నాగేశ్వర్‌రావు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రం వద్ద సీఐ నాగరాజరావు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ చెంగల్‌రెడ్డి, డిపార్ట్‌మెంట్ అధికారి సలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న కుమార్ బంధువులు, (ఇన్‌సెట్) చెరువులో పడి మృతి చెందిన కుమార్

విజయపురం (నగరి): మండలంలోని కేవీపురం దళితవాడ చెరువులో ప్రమాదవశాత్తు పడి కుమార్ (46) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. అయితే పోలీసులు అరెస్టు చేయడానికి రావడం వల్లే కుమార్ ఇలా చేసుకున్నాడంటూ బంధువులు, గ్రామస్తులు ఆరోపిస్తూ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, నగరి డీఎస్పీ రవి కుమార్, సీఐ శ్రీనివాసంతి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను ఆరా తీశారు. అనంతరం ఎస్ఈబీ ఏఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. కేవీపురం దళితవాడలో సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో శుక్రవారం రాత్రి పోలీసులు గ్రామానికి వెళ్లారన్నారు. అక్కడ చంద్రశేఖర్ (26), కుమార్ (46) సారా కాస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో కుమార్ తప్పించుకుని పారిపోయాడని తెలిపారు. ఈ క్రమంలో కుమార్ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడని, కుమార్ మృతికి, పోలీసులకు ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. దీంతో బంధువులు, గ్రామస్తులు ధర్నా విరమించారు.



జిల్లా ఎస్ఈబీ ఏఎస్పీ, డీఎస్పీతో మాట్లాడుతున్న మృతుడి బంధువులు

ఓపెన్‌స్కూల్‌లో అడ్మిషన్లకు మరో అవకాశం

- డీఈఓ విజయేంద్రరావు వెల్లడి

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ ఓపెన్‌స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు అడ్మిషన్లకు మరో అవకాశం కల్పించారని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023–24 విద్యాసంవత్సరానికి గానూ స్పెల్-2 లో మరోసారి అడ్మిషన్లు నమోదు చేసుకునేందుకు రాష్ట్ర అధికారులు అవకాశం కల్పించారన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలో అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆయా ఏఐ సెంటర్లలో ఈ నెల 22వ తేదీ నుంచి 31 వరకు అడ్మిషన్లు చేసుకోవాలన్నారు. స్పెల్-1 లో రిజిస్టర్ చేసుకుని అనివార్య కారణాలతో ఫీజు చెల్లించలేకపోయిన వారు పాత రిజిస్ట్రేషన్ నంబర్‌తో అడ్మిషన్ అయ్యేందుకు అవకాశం కల్పించారని చెప్పారు. వీరు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, ఇలా అడ్మిషన్ అయ్యేవారిని స్పెల్-2 అడ్మిషన్లుగా పరిగణిస్తారన్నారు. వీరికి జూన్‌లో నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షలతో కలిపి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అడ్మిషన్లు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయం, మీ సేవ కేంద్రాల్లో కూడా చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులకన్నా అధికంగా వసూలు చేసినట్టు ఫిర్యాదులు అందితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వివరాలకు జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో ఉన్న జిల్లా ఓపెన్ స్కూల్ విభాగంలో సంప్రదించవచ్చని తెలిపారు.

గ్యాస్ గీజర్ పేలి వృద్ధురాలు మృతి

చిత్తూరు అర్బన్: నగరంలో గ్యాస్ గీజర్ పేలి ఓ వృద్ధురాలు శనివారం మృతిచెందింది. వివరాలు ఇలా.. చిత్తూరు నగరంలోని సాంబయ్య కండ్రిగ ప్రాంతంలో ప్రేమలత (73) నివాసంలో గ్యాస్ గీజర్ పేలి మంటలు అంటుకున్నాయి. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. కాలిన గాయాలతో ఉన్న ప్రేమలతను బంధువులు వేలూరు సీఎంసీకి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందింది. దీనిపై వన్‌టౌన్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యాన్నదానానికి రూ.3 లక్షల విరాళం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి దాతలు రూ.3 లక్షలు విరాళంగా అందించారు. కుప్పంకు చెందిన భవాని, చెన్నైకి చెందిన జ్ఞానశేఖర్, తిరుపతికి చెందిన విజయగౌరి దాతలు వేర్వేరుగా స్వామివారి నిత్యాన్నదానం పథకానికి ఒక్కొక్కరు రూ.లక్ష చొప్పున విరాళం చెక్కులను శనివారం ఆలయ అధికారులకు అందించారు. అనంతరం దాతలకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విగ్నేష్ పాల్గొన్నారు.